# జన్మహాకు మరయా



కన్నాట్ సర్కస్‌లో ఆంధ్రా బాంకు ఎదుట కాస్సేపు అటూ ఇటూ తారట్లాడాడు రామారావు. అంతకు పదీ నిముషాల క్రిందట ఒకసారి బాంకు లోపలకు వెళ్ళి ముఖ పరిచయస్తులు ఎవరైనా ఉన్నారేమోనని చూసి వచ్చాడు. మరోసారి తెలుగు వాళ్ళెవరైనా ఉన్నారా అని వాకబు చేసి వచ్చాడు. తన పేరిట సస్పెన్స్ ఎక్కౌంటులో ఉన్న సొమ్ము తీసేసుకోవడానికి ఎవరైనా హామీ ఉండాలనీ లేక బాండ్ రాసి ఇవ్వాలనీ చెప్పారు. డైరెక్టరు గారు నాకు తెలుసు. వారిని కలుసుకుంటా''నని ఇంగ్లీషులో చెప్పుకుంటే ఒక గుమాస్తా విని నవ్వి ఊరుకున్నాడు. అవును మరి నా వేషం, నా స్థితి అలా ఉన్నది అనుకుని బాధపడ్డాడు. మళ్ళీ వరండాలోకి వచ్చి నిలబడ్డా డతను.

అంతలో బాంకు ముందు సరిక్రొత్త పెద్ద కారు ఆగింది. అది చాలా ఖరీదైనది. విదేశం నుంచి అప్పుడే దిగుమతి అయిన వాహనంలా కనిపిస్తున్నది. ముందు సీటులో కూర్చున్న వ్యక్తి నోట్లో నుంచి పైపు తీసి డ్రైవరుకు ఆజ్ఞలు జారీ చేశాడు. అతను దిగి వెనుక నుంచి వచ్చి కారు తలుపు తెరిచి ప్రక్కగా నిలబడ్డాడు. వెనుక సీటులో కూర్చున్న ఒకామె కారు దిగింది నెమ్మదిగా.

రామారావు ఒకసారి ఆమె వంక చూశాడు. ఆమె చాలా అందంగా, ఎంతో ఆకర్షణీయంగా ఉన్నది. ఆమె మంచి ఎత్తరి. అందుకు తగ్గట్లు ఒళ్ళు. ఆమె దేహ యష్టి కొట్టవచ్చినట్లుగా ఉన్నది. మేలిమి బంగారపు శరీర ఛాయ. ఆ వస్త్రధారణ, కేశాలంకరణ గమనించేసరికి ఆమె అచ్చంగా ఉత్తర భారత దేశపు స్త్రీ అనిపించింది. కానీ ముఖంలో తెనుగుతనం తొంగి చూస్తున్నది. అతను ఆశ్చర్యపడుతూ ఆమె వంక మళ్ళీ మళ్ళీ చూశాడు. ఆమె ఖరీదైన మంచి జరీ అంచు పల్చని పట్టు చీర కట్టింది. వెడల్పు జరీ అంచు పట్టు జాకెట్టు తొడిగింది. చెవుల కమ్మల రవ్వలు దూరం నుంచే ధగ ధగ మెరిసి పోతున్నాయి. ఆమె ధరించిన ఇతర ఆభరణాలు చూసి ఆమె నిజంగా జమీందారిణి ఏమో అనుకున్నాడతను.

ముందు సీటులో నుంచి దిగి వచ్చిన వ్యక్తి కొంచెం దూరంగా నిలబడ్డాడు రాచ ఠీవి ఒలకపోస్తూ.

ఒక్క నిముషం అలా చూసి రామారావు ఇది మర్యాద కాదని అనుకుంటూ గుమ్మం పక్కకు తప్పుకున్నాడు. ఆమె ఆర్భాటంగా లోపలకు వెళ్ళింది. అతని వంక అలా చూస్తూ వెళ్ళింది ఆమె. ఆమె అంతలో బయటకు తిరిగి వచ్చింది. వరండాలో ప్రక్కగా గోడవారగా నిలబడ్డ అతని వంక కొన్ని నిముషాలు తేరిపార చూసింది.

"మీరు... మీరు..." అంటూ సంతోషం, ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళి - "మీ పేరు రామారావు గారు కదూ!" అన్నది ఆమె.

"అవును... కాని..." అని ఆగిపోయా డతను.

ఆమె చప్పున అతని చేతులు పట్టుకుని - "ఎలాంటి వారు ఎలా అయిపోయారండీ. ఇంతకూ మీరు నన్ను గుర్తు పట్టలేదా?" అని అడిగింది ఆమె.

అతనికి మనసులో ఏదో స్ఫురించింది. ఆమె గుర్తుకు వచ్చింది. మనిషి మారినా, మాట తీరు మారినా, ఎంతో కాలం గడిచినా ఏదో లీలగా జ్ఞాపకం వచ్చింది. ఆ ఆలోచన వెన్నెల కాంతి రేఖలా మనసులో కదలాడింది. అతను అటు చూశాడు. "పైపు" కాలుస్తూ పొగ వదులుతూన్న వ్యక్తి కనిపించాడు "అబ్బే!" అనుకున్నాడు.

అంతలో కొన్ని క్షణాల క్రితం మనసులో ఒక మూల వెలిగిన వెన్నెల కాంతిపై మతిమరుపు మబ్బుల నీడలు పరచుకున్నాయి.

అంతలో ఆమె అతని చేతులు విడిచిపెట్టి "నేనండీ పార్వతిని" అంటూ ముందుకు వంగి పాదాభివందనం చెయ్యబోయింది. అతను చప్పున వారించాడు.

బూట్లు చప్పుడు చేసుకుంటూ వాళ్ళ దగ్గరకు వచ్చిన వ్యక్తి కోపంగా - "ఇక్కడేమిటి ఈ న్యూసెన్స్! పది మందిలో నా గౌరవ ప్రతిష్ఠలు మంటగలిపేస్తున్నావ్" అని ఆగి గుడ్లెఱ్ఱ చేసి ఒకసారి ఆమె వంకా, మరోసారి రామారావు వంకా కోపంగా చూశాడు. ఆ చూపులో మితిమీరిన గర్వం, అహంకారం కనిపించాయి రామారావుకు.

అతను చిరునవ్వు నవ్వాడు.

ఆయన మరింత మండీపడ్డాడు.

ఆమె కొన్ని క్షణాల తరువాత చనువుగా అతని చెయ్యి పుచ్చుకుని బాంకు లోపలకు తీసుకుని వెళ్ళి సోఫాలో కూర్చోపెట్టి తనూ పక్కగా కూర్చుని - "ఆయన నా భర్త. ఆయన గారి తీరే అంత. పట్టించుకోకండి" అని కొన్ని క్షణాలు ఆగి - "ముందు ఇక్కడకు ఏం పని మీద వచ్చారో చెప్పండి. వీళ్ళంతా నాకు బాగా తెలిసిన వాళ్ళు. ఏం సాయం కావాలి?" అని అడిగింది.

అతను సమాధానం చెప్పలేదు.

తల వంచుకుని కూర్చున్నాడు.

కొన్ని నిముషాల తరువాత ఆమెకు తన వల్ల సహాయం పొందడం అతనికి ఇష్టం లేదని అర్థం అయ్యింది.

"ఎందుకిలా అయిపోయారు? ఎక్కణ్ణించీ రావడం? ఎప్పుడు వచ్చారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. అతను దేనికీ సమాధానం చెప్పకపోయేసరికి ఆమె లేచి నిలబడి - "అవన్నీ తరువాత మాట్లాడుకోవచ్చు రండి ఇంటికి వెళదాం. ఈ బాంకులో నా పని తరువాత చూసుకుంటాను. పదండి మరి" అంటూ ముందుకు నడిచింది.

ఏదో ఆలోచిస్తూ అతను ఆమెను అనుసరించాడు.

మధ్యలో అతను ఆగిపోయాడు. ఆమె గబగబా ముందుకు వెళ్ళి భర్తను సమీపించి - "వారు రామారావు గారు... గొప్ప పండితులు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో ఆయన నిష్ణాతులు. గొప్ప సహృదయులు. మా గురువు గారు. మా నాన్న గారికి ఇష్టులు. ఆయనకు ఎంతో సాయం చేసిన ఉత్తములు. వారిని మనింటికి మీరు ఆహ్వానిస్తే మర్యాదగా ఉంటుంది" అన్నది ప్రాధేయపడుతున్నట్లుగా.

కొన్ని క్షణాల తరువాత ఆమె భర్త "పైపు" చేతిలోకి తీసుకుంటూ - "ఛ .. ఛ... ఎవరో జైల్ బర్డ్‌ను చూపించి నీ గురువు అంటున్నావ్. ఎన్నడూ లేనిది ఇవ్వాళ ఈ ప్రవర్తన బాగా లేదు. నా కిప్పటికే తలవంపులుగా ఉన్నది" అని ఆమె ముఖంలోకి చూసి - కళ్ళల్లో నీళ్ళు తిరగడం గమనించి - "ఆల్‌రైట్ - నీకు ఇష్టమైతే నువ్వే పిలు" అన్నాడు.

ఆమె వెను తిరిగి నెమ్మదిగా రామారావు దగ్గరకు వచ్చింది. వస్తూ - భర్త మాటలు అతనికి వినిపించాయేమోనని ఆమె చాలా భయపడిపోయింది.

ఆమె రామారావు ముందు నిలబడి నెమ్మదిగా - "మీ రాయన మాటలేమీ పట్టించుకోకండి. మీకు ఎన్నో విషయాలు చెప్పుకోవాలి. రండి - మీరు, రాకపోతే నా మీద ఒట్టే. మీరు రాకపోతే నా మీద కక్షకట్టారనుకుంటాను..." అని ఆగితే అతను - "నేను వస్తాను. ఇక్కడ నా కో ఆప్త మిత్రుడు ఉన్నాడు. అతనే నన్ను కష్టాలలో ఆదుకున్నాడు. ఈ బాంకు వ్యవహారం' కూడా అతనికే వప్పగించి వస్తాను. అంటే తరువాత బస్సులో వస్తాను. చిరునామా వ్రాసి ఇచ్చి వెళ్ళు" అన్నాడు.

ఆమె "వానిటీ బాగ్" తెరిచి తన భర్త చిరునామా ముద్రించిన చిన్న కార్డు ఇచ్చింది. ఎలా రావాలో గుర్తులు చెప్పింది. అక్కడికి వచ్చి నాగరాజు ఇల్లెక్కడ అని హిందీలో ఎవరిని అడిగినా చెబుతారనీ, తను ఉంటున్న గ్రేటర్ కైలాస్‌లో తమ భవనం గుర్తించడం చాలా సులభమనీ చెప్పింది. "రావాలి మరి!" అంటూ ఇంకా బ్రతిమిలాడబోతుంటే - "వస్తానన్నాను గదా" అని మాత్రమే అన్నాడు రామారావు.

"మీరు వచ్చేదాకా నేను గుమ్మంలోనే నిలబడి ఉంటాను తెలిసిందా?"

"అలాగే తప్పక వస్తాను."

** ** ** **

ఇంటి దగ్గర ఆమె మరీ అందంగా



కనిపించింది. చాలా పలచని ఖరీదైన షిఫాన్ చీర కట్టింది. భుజాలు కనిపించేలా చేతులు లేని చిన్న జాకెట్టు తొడిగింది. మెడలో సన్నని బంగారపు గొలుసు తప్ప మరే యితర ఆభరణాలు లేవు. ఒక చేతికి మాత్రమే గాజులున్నాయి. ఎడమ చేతికి పెట్టుకున్న రిస్ట్ వాచీ, దాని బంగారపు గొలుసు చాలా అందంగా ఉన్నాయి. ఆమె అతనికి ఆ ఇల్లంతా వెంట ఉండి చూపించింది. ఒక ప్రక్కగా వేరుగా ఉన్న పెద్ద హాలు వంక చూపుతూ - "అదుగో అది. ప్రత్యేకం వారి కోసం కేటాయించింది. విదేశీ సరుకులతో నింపేశారు. వారి మిత్రులు సరాసరి అక్కడికే వచ్చి వెళతారు. వేరే గుమ్మాలున్నాయి. ఆయన ప్రస్తుతం అక్కడే ఉన్నారు.

*ఔషధ సేవలో ఉండవచ్చు. అందుకనే మిమ్మల్ని అక్కడకు తీసుకుని పోవడం లేదు. రండి. ఇటు లోపల మరో హాలులో కాసేపు విశ్రాంతి తీసుకుందురుగాని. ముందు ఫలహారం, కాఫీ, టీ, పండ్లు, పండ్ల రసాలు - ఏం కావాలన్నా సిద్ధంగా ఉన్నాయి. తెప్పించి ఇస్తాను" అన్నది.

"ఏమీ వద్దు. చల్లని మంచి నీళ్ళు ఇవ్వు" అంటూ వెళ్ళి అతను సోఫాలో కూర్చున్నాక ఫ్రిజ్‌లో నుంచి చల్లని నీరు తెచ్చి గ్లాసులో పోసి అతనికి అందిస్తూ ఆమె - "మీరు పూర్తిగా మారిపోయారు. వచ్చి ఇంత సేపయ్యింది. ఇన్నేళ్ళ తరువాత కనిపించిన నాతో ఆప్యాయంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. క్షేమ సమాచారాలు అడగలేదు. మీ స్వవిషయాలు చెప్పలేదు. పైకి అప్పుడప్పుడూ చిరునవ్వు నవ్వుతున్నా లోపల్లోపల ఏదో బాధపడుతున్నట్లుగా, భయపడుతున్నట్లుగా కనిపిస్తున్నారు. పూర్వం ఎప్పుడూ మంచి దృఢంగా, ఆరోగ్యంగా, అందంగా, ఉత్సాహంగా కనిపించేవారు. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేవారు. ఇప్పుడేమిటి ఇలా ఉన్నారు? ఆ గెడ్డం ఏమిటి? ఆ మాసిన దుస్తులేమిటి? ఉదయం నుంచి ఇప్పటిదాకా దుస్తులు మార్చుకునే వ్యవధి కూడా లేకపోయిందా? అసలేం జరిగిందో చెప్పండి" అంటూ మళ్ళీ మళ్ళీ అడిగింది.

అతను చేతిలో ఉన్న ఖాళీ గ్లాసు టీపాయ్ మీద పెడుతూ "నా ప్రస్తుతపు ఇబ్బందులను గురించి చెబితే - ఇంతటి ఐశ్వర్యం అనుభవిస్తున్న నీకు మనస్సుకు కష్టం కలగవచ్చు... అందులో నువ్వు అమాయకురాలవు" అని ఆగిపోయాడు.

ఆమె భుజాలపై పమిట బాగా కప్పుకొంటూ ముందుకు వచ్చి అతనికి ఎదురుగా కూర్చీలాక్కుని కూర్చున్నది. తల వంచుకున్నది. "ఎందుకు నా బొంద, ఈ వెధవ ఐశ్వర్యం" అంటూ గొణిగింది.

"అంటే అర్థం కాలేదు. ఇదంతా నీ సొంతం కాదంటావా?"

"ఇల్లు అద్దె యిల్లు. సామాన్లు సొంతం."

"చాలదా? ఆ మరిచాను సంతానమా?"

"లేదు!"

"అందుకేనా ఈ యీసడింపు - అసంతృప్తి. కొంత మందికి ఆలస్యంగా కలుగుతుంది సంతానం."

"అలా అనుకునే మొదట్లో చాలా కాలం ఊరుకున్నాను. కానీ కలక్కపోతేనే మంచిదైందని ఇప్పుడు తెలుసుకున్నాను."

"అదేమిటి అలా అంటున్నావ్?"

"అది వైద్యులు అంటున్నమాట."

"అయితే వైద్యం చేయించుకోవచ్చుగా."

"వేలకు వేలు పోసి వైద్యం చేయించుకుంటూనే ఉన్నా రాయన. కానీ మందులకు లొంగడంలా. స్వయం కృతాపరాధం. ఆయన సంగతి తెలిసిన నాటి నుంచీ నేను దూరంగా ఉంటున్నాను."

"ఇల్లాంటి విషయాలు నువ్వు నాతో చెప్పకూడదు. ఎవరైనా వింటే అపార్థం చేసుకుంటారు."

"ఇక్కడకు పరాయి వాళ్ళు ఎవ్వరూ రారు. పనివాళ్ళు పిలిస్తేనే గానీ రారు. నేను మరొకరితో మాట్లాడుతున్నప్పుడు ఆయన ఇక్కడకు రారు. వచ్చినా, విన్నా ఇప్పుడు భయం లేదు. మనసు విప్పి చెప్పుకునేందుకు నా కిన్నాళ్ళూ ఓ మనిషే దొరకలేదు."

"అదేమిటి-మీ నాన్నగారు?"

"ఆయన పోయి చాలా కాలం అయింది."

"అయ్యో పాపం అలాగా! మరి ఆస్తి అంతా ఏమైంది?"

"నా పెళ్ళికి విశాఖపట్నంలో ఉన్న ఇల్లు అమ్మారు. అదే మీరు కొన్న ఇల్లు. ఆ డబ్బు ఈయన గారికి కట్నం క్రింద ఇచ్చారు."

"అలాగా! ఆయన నాతో అలా చెప్పలా. నిన్ను ఒక అయ్య చేతిలో పెట్టి త్వరగా స్వగ్రామం వెళ్ళాలనీ, అక్కడ ఆస్తి వ్యవహారాలు స్వయంగా చూసుకోవలసి ఉన్నదనీ అన్నారు."

"మీరు మరోలా అనుకున్నారు."

"మరోలా ఏముందీ? నిన్ను నా చేతిలో పెడతారనే అనుకున్నాను. మనం ఇద్దరం స్నేహంగా ఉన్నాము. అందు కాయన అన్ని విధాలా ప్రోత్సహించారు. అసలు నీకు చదువు చెప్పాలని నన్ను మీ ఇంటికి తీసుకుని వచ్చిందే ఆయన కదా! నాతో స్నేహం చెయ్యమని నీకూ, నీతో స్నేహం చెయ్యమని నాకూ గట్టిగా బోధించింది కూడా ఆయనే కదా! అటువంటప్పుడు నేను మరోలా ఎందుకనుకుంటానూ!"

"అవును. అవన్నీ నిజం. ఇంతకాలం తరువాత మీకానాటి విషయాలన్నీ ఇంకా జ్ఞాపకం ఉన్నాయా? అయితే మరి నన్ను వెంటనే గుర్తుపట్టలేదేం? సరే పోనీండి. కానీ ఆనాటి వ్యవహారాలలో నాన్నగారి తప్పేమీ లేదు. తల్లి లేని పిల్లనని నాకు గారాబం ఎక్కువ చేశారు. నా ఇష్టానికి అనుగుణంగా ఆయన నిర్ణయాలు మార్చుకున్నారు. అప్పుడు మీరు చేసిన ఉపకారానికి నేనెంతో ఋణపడి ఉన్నాను. ఆనాడు మేం చేసిన పనికి మీకు కోపం వచ్చిందనుకుంటాను. క్షమించండి" అంటూ ఆమె ముందుకు వంగి అతని రెండు చేతులూ పట్టుకుని క్షమించానని చెప్పండని బ్రతిమిలాడింది.

అతను నెమ్మదిగా ఆమె చేతులు విడిపించుకుని సోఫాలో ప్రక్కకు కొంచెం దూరంగా జరిగి - "పార్వతీ! నువ్వు దూరంగా ఉండు. నీ స్పర్శ నన్ను ఆవేశపరుస్తుందని కాదు. ఇది మర్యాద కాదు. అంతే. నేను పరాయి వాణ్ణి" అన్నాడు. అందుకామె నవ్వుతూ - "కానీ ఏనాడో పాణిగ్రహణం చేశారు" అన్నది.

"చెయ్యి పట్టుకున్నాననేగా. మన విషయంలో అంత వరకే దాని అర్థం. ఆనాడు నువ్వు కన్యవు. కనుక తప్పు లేదు. నాకా యోగ్యత ఉన్నది. అందువల్ల శాస్త్ర విరుద్ధం కాదు. కాని నువ్వన్న మాటలకు రూఢ్యర్థం వేరు. పాణిగ్రహణం అంటే వివాహం చేసుకోవడం తెలుసా?" అని అడిగాడు రామారావు.


"ఆ మాత్రం తెలియకపోలేదు. మీ దగ్గర రెండేళ్ళు చదువుకున్నాను. అంత చిన్న వయసులో కూడా తెలుసు."

"అయితే మరి ఎందుకు మౌనం చేశావ్?"

"అంత మాట అనకండి. మీకు నా యందు ప్రేమ భావం కలిగింది. పెండ్లి ప్రస్తావన కూడా వచ్చింది. కానీ నాకు మాత్రం మీ యందు ప్రేమ కలగలేదు. గురుభావం ఉన్నది. అభిమానం, గౌరవం మొదటి నుంచీ ఉన్నాయి. అదీగాక మన మధ్య వయస్సు తేడా కూడా ఎక్కువే. నాకప్పుడు పదహారేండ్లు. మీ వయస్సు ముప్పై అని మీరే చెప్పారు. అవునా?"

"అవును. ఏం ఆ మాత్రం తేడా ఉంటే నష్టం ఏముందీ?"

"ఏం లేదు. అప్పట్లో నాకు అది ఫాషన్ కాదనిపించింది. జాగ్రత్తగా



ఆలోచించలేకపొయ్యాను."

"ఆ మాట నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు. ఇల్లు అమ్మకం కాగానే రహస్యంగా వెళ్ళి తిరుపతిలో పెళ్ళి చేసుకుని అటు నుంచి అటే వెళ్ళి పోయావు. నా యందు అంతటి గురుభావం, సద్భావం ఉన్న దానివి నాకు ముందుగా చెప్పలేకపోయావా?"

"చెబితే మీరు సహించేవారా?"

"నాకు నచ్చచెబితే - నేనంటే నీకు ఏ మాత్రం ప్రేమ లేదనే విషయం వివరించి చెబితే ఎంత బాగుండేది!"

"మీ మనస్సు మరీ సుకుమారం. ఏమంటే ఎక్కడ బాధపడతారో అని చెప్పలేదు."

"నా యందు అంత అభిమానం, జాలి ఉన్న దానివి ఇంత ఘోరం ఎలా చేశావ్?"

"ఏమో నాకే అర్థం కాలేదు. తరువాత పశ్చాత్తాపపడ్డాను - మరీ ఈయన వ్యవహారాలు అన్నీ తెలిశాక - ఏమైనా మీ కానాడు కష్టం కలిగించాను. క్షమించండి. క్షమించండి - అంటూ ఇంత ప్రాధేయపడుతుంటే మీరిలా నిల దీయడం భావ్యం కాదు."

"ఇరవై సంవత్సరాల తరువాత నువ్విలా క్షమాపణలు చెప్పుకోవడం అనవసరం. ఇంత మంచి సంస్కారం కలదానివి, మంచి కుటుంబంలో పుట్టిన దానివి ఎందుకలా చేశావా అని ఎంతో కాలం మథనపడ్డాను. అప్పటి సంగతులన్నీ జ్ఞాపకం చేసేసరికి..." అంటూ ఏమో చెప్పబోతుంటే అతని మాటలకు అడ్డం వచ్చి ఆమె కొంచెం పెద్దగా - "పోనీండి. అదంతా మరిచిపోదాం. పదండి వడ్డిస్తాను. భోజనం చేద్దురుగాని" అన్నది ఆమె.

"వద్దు. నన్ను వదిలేయ్. ఇంత ఆలస్యం అయింది - ఇప్పుడు భోజనం ఏమిటీ - మూడు దాటలా - బలవంతపెట్టకు. ఉదయం అక్కడ బాంకు దగ్గర కనిపించినప్పుడు నీవు నన్ను గుర్తుపట్టకుండా ఉంటేనే బాగుండేది. నా దుస్తులూ - నా పరిస్థితీ చూసి నీ భర్త ఏమన్నాడో గుర్తుందా?"

"మీరు విన్నారా?"

"ఏం వినపడకుండా నీతో రహస్యంగా అన్నాడనుకుంటున్నావా?"

"అయితే క్షమించండి. మీరు ఆయన విషయం ఏదీ పట్టించుకోకండి. తనలాగే అందరూ మోసగాళ్ళు అనుకుంటున్నారాయన. నా కంటే పన్నెండేళ్ళు పెద్ద. పెళ్ళి నాటికి ఇరవై రేండేండ్లనీ, బి. ఏ. పాస్ అయ్యాననీ, తనకు ఆస్తి చాలా ఉన్నదనీ, వ్యాపారం చేస్తున్నాననీ, అర్జెంటుగా డబ్బు అవసరం' అయ్యిందనీ, లేకపోతే కట్నం తీసుకునే వాణ్ణి కాదనీ ఇలా ఎన్నో చెప్పారు. అవన్నీ అబద్ధాలని తరువాత తెలిసింది. ఆయన డబ్బు కోసం మా నాన్న గారిని చివరిదాకా పీడిస్తూనే ఉన్నారు. మా నాన్న గారు యావదాస్తీ అమ్మే దాకా నిద్ర పోలేదంటే నమ్మండి. ఆయన దగ్గర ఇంక చిల్లిగవ్వలేదని తెలిశాక బలవంతంగా బయటకు. నెట్టేశారు. ఆయన వార్థక్యంలో కాశీలో కొంత కాలం గడిపి దారిద్ర్యం అనుభవించి కాలం చేశారు. ఆయన పోయిన చాలా కాలానికి గానీ నా కా విషయం తెలియలేదు..." అంటూ చెప్పుకుపోతూ పాత విషయాలన్నీ ఒక్కసారి జ్ఞాపకం వచ్చి బాధ కలిగి కొన్ని క్షణాలు ఆగింది. కళ్ళు తుడుచుకుని అతని వంక చూసింది. అతను తన మాటలు వినడం లేదని అప్పుడు అనుమానం వచ్చింది ఆమెకు. "ఏమి టీయన ఒక్క పిసరు సానుభూతి చూపడం లేదే!" అనుకుంటూ అతని వంక అలా చూస్తూ ఉండిపోయింది.

అప్పుడు రామారావు నేల వంక చూస్తున్నాడు. ఆ గదిలో దేనికోసమో వెతుకుతున్నట్లు అతను నలువైపులా పరీక్షగా చూస్తున్నాడు.

అంతలో అతనికి సోఫా క్రింద సన్నని వైరు కనిపించింది. అతను కొన్ని క్షణాలు దాని వంక భయంగా, అనుమానంగా చూశాడు. ఆ తీగ, ఎదురుగా నేల మీద సోఫా దగ్గర నుంచి ఎదుటి గుమ్మం దాకా పరిచిన తివాచీ క్రింద కూడా ఉన్నట్లు అతనికి స్పష్టం అయ్యింది. అనుమానం దృఢపడింది. ఆమె వైపు దృష్టిమరల్చాడు. కొన్ని క్షణాలు ఆమె వంక పరిశీలనగా చూశాడు. ఆమె అమాయకురాలని నిర్ధారణ అయ్యింది.

అతను తన వైపు చూసేసరికి ఆమె మళ్ళీ ఏదో చెప్పబోయింది. "ఆయన ఎవరనుకున్నారు" మాట పూర్తి కాకముందే అతను ఒక్క అంగలో ముందుకు వెళ్ళి ఎడం చేత్తో ఆమె నోరు గట్టిగా మూశాడు. కుడి చేయి ఆమె నడుము చుట్టూ వేసి పొదివి పట్టుకున్నాడు. ఆ పెనవేయడంతో ఆమె చేతులు కదల్చలేకపోయింది. "అవన్నీ నాకు అనవసరం. చెప్పకు. ఇంక నే వెళుతున్నా" అన్నాడు రామారావు కావాలని పెద్దగా.

ఆమె మొదట నిర్ఘాంతపోయింది. అంతలో నిలువునా కంపించిపోయిం దామె. ఒక వంక ఆశ్చర్యం, మరొక వంక భయం. ఒళ్ళంతా వింత వింతగా పులకరింతలు, కలలో కూడా ఆశించని కొత్త ఆశలు కలిగేసరికి ఆమె ఆశ్చర్యపడింది. పర పురుష స్పర్శ తన్ను పరవళ్ళు త్రొక్కిస్తుంటే భయపడిం దామె. ఇంతటి సత్పురుషుడు ఇంతటి దుస్సాహసానికి ఒడిగడతా డా అన్న అనుమానం కలిగింది. ఆమెకు తల తిరిగినట్లయింది. తూలిపోబోయింది. మరికొన్ని క్షణాల తరువాత అతను ఆమెను నెమ్మదిగా వీధి గుమ్మం వైపుకు నడిపించుకుని వెళ్ళాడు. అక్కడ కొన్ని క్షణాలు ఆగా డతను. ఆమె అతని భుజం పైన తలవాల్చింది. కొంతసేపు తరువాత నెమ్మదిగా తెలివి వచ్చినట్లయింది. ఇంతసేపూ కళ్ళు మూతలు పడ్డాయని కూడా ఆమెకు అప్పుడు తెలిసి వచ్చింది.

ఆమె కళ్ళు తెరిచి అతని వంక అలా చూసింది.

అమాయకత్వం, ఆప్యాయత, భయం, అనుమానం అభివ్యక్తం అయ్యాయి ఆమె చూపులో.

"ఇష్" అంటూ మాట్లాడవద్దని అతను సంజ్ఞ చేశాడు. నెమ్మదిగా ఆమె పై నుంచి చేతులు తీసేసి కొంచెం దూరంగా జరిగి నిలబడ్డా డతను. అప్పటికి ఆమె కొంత వరకు తేరుకున్నది.

అతను ముందుకు వెళ్ళి గేటు దగ్గర ఆగాడు.

ఆమె అటూ ఇటూ చూస్తూ నెమ్మదిగా అతన్ని సమీపించింది.

కొన్ని నిముషాల తరువాత అతనే - "మీ నాన్న గారి ఇబ్బందులను గురించి నాకు ఒక్క ముక్క రాయవలసింది. కాక కబురు చెయ్యవలసింది. తప్పక సహాయం చేసేవాణ్ణి. ఆ మాత్రం తెలియదా నీకు" అంటూ సంభాషణ ప్రారంభించాడు.

"అంటే ఇందాక నా మాటలన్నీ విన్నారన్న మాట" అని కొన్ని క్షణాలు ఆగి - "ఆ పాత ఇల్లు అంటగట్టారని మీకు కోపం వచ్చిందేమోనని అనుకున్నాము" అన్నది ఆమె.

"అవును. మొదట్లో అలానే అనుకున్నాను. కానీ ఇల్లు చిన్నదైనా ముందు చాలా ఖాళీ స్థలం ఉన్నది. అక్కడ కొట్లు కట్టించి అద్దెకు ఇచ్చాను. ఆ ఇంటికీ, కొట్లకూ కలిపి నెలకు ఎనిమిది వందలదాకా అద్దె వసూలు అవుతున్నది. మీ నాన్నగారు డబ్బుకు ఇబ్బందిపడుతున్నారని తెలిస్తే ఆ అద్దె ఆయనకే పంపే ఏర్పాట్లు చేసేవాణ్ణి."

"అదంతా అద్దె కిచ్చానంటున్నారు. మరి మీ రెక్కడ ఉంటున్నారు. ఎక్కడ ఎలా స్థిరపడ్డారో చెప్పరేం?" అని అడిగింది ఆమె. అతను మారుమాటాడకపోయేసరికి కొన్ని నిముషాలు ఊరుకుని, ఆమె రహస్యంగా అంటున్నట్లు "ఇవన్నీ పోనీండి. ఇందాక మీరు ... ... ... " అని ఆగి అతని వంక చూసింది.

"మన సంభాషణ టేప్..."

"ఎక్కడ మా ఇంట్లోనే. ఇంత అన్యాయమా?



అదెలా సాధ్యం ఆయనకు తెలియకుండా? ఇది ఆయన పనే...!"

"నువ్వు ప్రస్తుతానికి ఆ విషయం మరిచిపో. కోపం తెచ్చుకోకు. ఆయన నన్ను అనుమానించి ఉండవచ్చు. రికార్డు అయిన టేపులో అసలు స్వవిషయాలు ఏమీ లేవు. నా కీ అనుమానం వచ్చిందని ఆయనకు ఏ మాత్రం తెలియకూడదు. అర్థం అయిందా?"

"అర్థం అయ్యింది. కానీ ఒక్క మాట చెప్పండి. మీరు రాజకీయ వాదులా? రహస్య కార్యక్రమాలతో మీకేమైనా సంబంధం ఉన్నదా? కాక మా వారిలా ఇది ఏమైనా ఒక వ్యాపారమా?"

"లేదు... కానీ నీ భర్త అన్నమాట ఒకటి నిజం."

"అయితే మీరు చేసిన నేరం ఏమిటి?"

"వాక్స్వాతంత్ర్యం ఉండాలని అన్నాను."

"ఆ మాట అన్నందుకే... " అని ఆగి ఆమె కొన్ని క్షణాల తరువాత కావాలని చిరునవ్వు నవ్వుతూ -

"అయినా మీరు మాత్రం ఆ మాట అనడానికి ఇంత దూరం రావాలా?" అన్నది.

అందుకతను వెంటనే -

"అవసరమైతే ఎంత దూరమైనా రావాలి. అన్నింటికంటే వాక్స్వాతంత్యం ముఖ్యం. అది మన జన్మ హక్కు. పత్రికా స్వాతంత్ర్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఉన్నది. కూడూ గుడ్డా లేని నిర్భాగ్యులకు ఇవి దేనికని వాదించే వాళ్ళున్నారు. వాళ్ళు ప్రజలను తప్పుదోవ పట్టించేవాళ్ళని గుర్తించాలి. ఇవి ఉచ్ఛ్వాస నిస్వాసాల వంటివి. కూడు లేకున్నా కొన్నాళ్ళైనా బ్రతకవచ్చు. కానీ ఇవి బంధిస్తే ప్రాణం నిముషం నిలువదు. జాతి విషయంలో కూడా ఇది అక్షరాలా నిజం."

"అయితే ఈ ప్రబోధం చెయ్యడానికి ఇంత తెగించి ఇంత దూరం వచ్చారన్నమాట."

"అవును. ఒక సామాన్య పౌరుడుగా ... ఒక విద్యావంతుడుగా - అంటే సదసద్వివేకం కల వ్యక్తిగా అది నా ప్రథమ కర్తవ్యం. అదీగాక పెద్దలతో మాట్లాడడానికి వచ్చాను. అనేక ప్రాంతాలకు వెళ్ళాను. వాస్తవ సమాచారం సేకరించి వారికి అందజేశాను."

"అప్పుడు పట్టుకున్నారా?"

"లేదు."

"మరి?"

"ఒక వీథిలో ఒక కుర్రవాడు కరపత్రాలు పంచిపెడుతున్నాడు. అతన్ని పట్టుకున్నారు. అది అన్యాయం. అనాగరికం అంటూ నేను అడ్డు వెళ్ళాను. నగం దెబ్బలు నాకు తగిలాయి. ఇద్దరినీ వేరు వేరుగా బంధించారు. అతన్ని హింసించారు- దీని వెనుక ఎవరున్నారో చెప్పమని - నేనెవరో చెప్పమని నా విషయంలోనూ అదే వరస. తెలియదు కనుక చెప్పలేదు. అయినా నాకు తరువాత శిక్ష విధించారు. "చికిత్స" జరిగింది."

"అందుకేనా ఇలా అయిపోయారు?"

"చాకి రేవుకు వేస్తే..."

"అయ్యో ఇంక చెప్పకండి. నేను భరించలేను."

"మాట్లాడకూడదు అనుకుంటూనే ఇంతసేపు మాట్లాడాను. పొరపాటే. కమ్ముకున్న కారు మేఘాలు తొలగిపోయి మంచి రోజులు వస్తున్నాయని పెద్దలు అంటున్నారు. ఆ ఆశ నాకూ కలిగింది" అంటూ మధ్యలో ఆగి వీథి వైపు చూసి - "అదుగో నా మిత్రుడు నా కోసం ఎదురు చూస్తున్నాడు. మళ్ళీ నా కెక్కడ ఏ ఇబ్బంది వస్తుందో అని ఆదుర్దా అతనికి" అన్నాడు అతను.

"మీరు ఎందుకింత భయపడుతున్నారు? - మరి ఇంత భయస్తులు ఇంత సాహసం ఎందుకు చేశారు?"

"దేశం కోసం, సత్యం - అహింస పట్ల విశ్వాసం పునరుద్ధరించడం కోసం."

"మరి భయం దేనికీ?"

"అక్కడ జరిగిన చికిత్స ప్రభావం అది. నన్ను గురించిన పూర్వ సమాచారం తెలిస్తే నేను పడిన బాధలన్నీ నా వాళ్ళు పడవలసి వస్తుందేమోనని భయం."

"అలాగా మీ లాంటి వాళ్ళ కుటుంబాలు కూడా కష్టాలపాలయ్యాయన్నమాట."

"అందరూ కాదు- కొందరు."

"అందుకేనా మీ స్వవిషయాలు ఏవీ ఒక్కటీ చెప్పకుండా దాటవేశారు?"

అతను మళ్ళీ మౌనం వహించాడు.

"సరే పోనీండి. ఆ సంగతి వదిలేద్దాం. నన్ను కూడా మీ ఆత్మీయులలో ఒకర్తెగా పరిగణించి ఈ జాగ్రత్త వహిస్తున్నారు. అంత వరకు అర్థం అయ్యింది. నాకు ఒక్క మాట - ఒక్క సలహా చెప్పి వెళ్ళండి. చాలు అదే పదివేలు" అన్న దామె.

"ఏమిటి?"

"నా భర్త విషయం. ఈ కాసేపట్లోనే ఆయన ఎటువంటి వారో మీకూ అర్థం అయిందనుకొంటాను. కావాలంటే విరాలు చెబుతాను. ఈయనతో తెగతెంపులు చేసుకుని బయటపడాలని ఉన్నది. మీ సలహా చెప్పండి."

"ఇది నీ సొంత విషయం. దేశ సమస్యలతో పోలిస్తే - ఇది అతి స్వల్ప విషయం. నీవు స్వయంగా ఆలోచించుకుని లాభ నష్టాలు బేరీజు వేసుకుని అండదండలు సమకూర్చుకుని, రాగల ఆటంకాలు, అవరోధాలను గురించి అంచనా వేసుకుని బహు జాగ్రత్తగా అడుగు ముందుకు వెయ్యాలి. నీ భర్త విషయాలు ఇప్పుడు నాకు చెప్పినా ప్రయోజనం లేదు. చాలా తప్పులు చేసి ఉండవచ్చును. ఈ ఐశ్వర్యానికి అదే కారణం కావచ్చు. ఇందులో నువ్వు ఇన్నాళ్ళూ పాలు పంచుకుని ఇప్పుడు హఠాత్తుగా కాదంటే సరిపోతుందా? నేను ఏం చెప్పినా నా స్వార్థం కోసం చెప్పానని, చేశానని అనుకునే అవకాశం - కాదు ప్రమాదం ఉన్నది. నువ్వు కాకపోయినా పరాయి వాళ్ళు అనుకుంటారు. ముందు నీ భర్త అనుకుంటాడు. ఇలా అంటున్నానంటే నీకు పిరికి మందు పోస్తున్నానని మాత్రం కాదు. అతను చేసిన - చేస్తున్న నేరాలు, దేశ ద్రోహం క్రిందకు వస్తాయనుకుంటే - నిర్భయంగా బయటపెట్టు. అలాంటి నేరం చేసిన వ్యక్తి ఎవరైనా సరే బయటపెట్టి తీరాలి. నువ్వు ఆ పని స్వయంగా చెయ్యలేవు. అందుకు - ఈ చిరునామా ఇస్తున్నాను. అవసరం అయితే పదిసార్లు చదివి జ్ఞాపకం పెట్టుకుని ఈ కాగితం చింపిపారేయ్. వాళ్ళు జాగ్రత్తగా విచారణ జరిపి, ప్రబలమైన, స్థిరమైన సాక్ష్యాలు సేకరించి, అవన్నీ ప్రచురించి తగిన శిక్ష పడేలా చేస్తారు. ఇక నీ విషయం. ఇంత వయసు వచ్చాక - ఎంత అందగత్తెవయినా, విడాకులు పుచ్చుకుని ఏం చేస్తావు? పునర్వివాహం చేసుకోగలవా? అందుకు ఎవరు సిద్ధంగా ఉన్నారు? జీవితం మొదలెత్తుకోగలవా? ఇవన్నీ మళ్ళీ మళ్ళీ ఆలోచించుకో. ఒక గట్టి నిర్ణయానికి రా. అప్పుడు నాకు తోచిన సహాయం చేస్తాను. దేశంలో ఏదో మార్పు రాబోతున్నది. అందుకు తగిన ఏర్పాట్లు జరిగాయి. అందరూ ఆ యా పనుల్లో మునిగితేలుతున్నారు. ఇటువంటి సందర్భంలో వ్యక్తిగత సమస్యలకు అనవసరపు ప్రాధాన్యం ఇవ్వకూడదు. అపనిందలకు ఆస్కారం కల్పించకూడదు. అదుగో అతను ముందుకు వస్తున్నాడు. అంటే నన్ను రమ్మని చెప్పినట్లే అర్థం. అవతల నాకు చాలా పనులున్నాయి. నేను ప్రస్తుతం ప్రయాణపు సన్నాహాలలో ఉన్నాను. డబ్బు సహాయం కూడా అతనే చేస్తున్నాడు. మరి సెలవు."

"ఇంత హఠాత్తుగా మీకు వీడ్కోలు చెప్పవలసి వచ్చినందుకు నాకు బాధగా ఉన్నది. కానీ తప్పదు కదా! మీకు శుభం కలగాలని మనసారా కోరుకుంటున్నాను. మరొక్క మనవి. మీ కింత సహాయం చేస్తున్న అతను చాలా ఉత్తముడనీ, సమర్థుడనీ అనిపిస్తున్నది. అతన్ని రెండు రోజుల తరువాత. సరిగ్గా మనం ఈ రోజున కలుసుకున్నచోటుకు - ఆదే సమయానికి రమ్మనండి. నేను ఒంటరిగా వెళ్ళి మాట్లాడతాను. మీకులాగానే అతను మరి కొందరికి సహాయం చెయ్యవలసి రావచ్చు. అందుకు ఏర్పాట్లు నేను చేస్తాను. అంతేకాక నా స్వ విషయంలో సహాయం అర్థిస్తాను."

"చెబుతాను. అంతే. అతని తరఫున ఎటువంటి వాగ్దానాలు చెయ్యను. ఆ మరిచిపోవద్దు. ఆ చిరునామా ఉన్న కాగితం నువ్వు లోపలకు వెళ్ళక ముందే... ... .. " అంటూ మాట పూర్తి చెయ్యకుండానే రామారావు అడుగు ముందుకు వేశాడు. వెను తిరిగి చూడకుండా అతను గబగబా ముందుకు సాగిపోయాడు.

పార్వతి చాలాసేపు అక్కడే నిలబడి ఆ వీథి వంకే చూస్తూ ఉండిపోయింది.

